ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 23 సెప్టెంబరు 2025



పశుసంవర్ధక జేడీగా మురళీకృష్ణ



విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా కె.మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కార్యాలయలో తన ఛాంబర్లో బాధ్యతలు చేపట్టారు. ఈయన పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పశు సంవర్ధకశాఖాధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై జాయింట్ డైరెక్టర్‌గా విజయనగరం వచ్చారు. ఇక్కడ పనిచేసిన వైపీ రమణ ఉద్యోగ విరమణ పొందారు.



విజయనగరం ఎన్‌సీఎస్ రోడ్డులో దుర్గాదేవి ఊరేగింపు

కొలువుదీరిన కనకదుర్గ

- జిల్లాలో వాడవాడలా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆరంభం
- సందడిగా అమ్మవారి ఊరేగింపులు
- మాలధారణలో వేలాది మంది భక్తులు

విజయనగరం రూరల్/ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రులు జిల్లాలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా దుర్గమ్మ కొలువుదీరింది. అమ్మవారి విగ్రహాలను మంగళవాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలు, బాంబుల మోత మధ్య భారీ ఊరేగింపుగా వెళ్లి ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించారు. 11రోజుల పాటు అమ్మవారి పూజలకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. తొలిరోజు అమ్మవారు బాలత్రిపురా సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విజయనగరం న్యూపూర్ణ జంక్షన్ ప్రాంతంలో కొలువైన దుర్గాదేవి, ఎన్‌సీఎస్ రోడ్డులో హెల్పింగ్ హేండ్స్, హిజ్రాస్ అసోసియేషన్, రైల్వేస్టేషన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ప్రతిమలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని భక్తులు వేలాదిగా అమ్మవారి మాలధారణ చేశారు. ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.


లోపలి పేజీల్లో మరిన్ని ఫొటోలు



వైస్సార్‌నగర్‌లో కొలువుదీరిన అమ్మవారు

రామతీర్థంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- నేటి నుంచి 9 రోజులపాటు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



నెల్లిమర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో మంగళవారం నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. వచ్చేనెల 2వ తేదీ విజయదశమి వరకు 9 రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం అంకురార్పణతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 29న వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణం నిర్వహించడానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయదశమి పర్వదినంనాడు పూర్ణాహుతి, స్వామివారి చక్రస్నానం, జమ్మివేట తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల అనంతరం 3వ తేదీన స్వామివారి పుష్పయాగం ఉంటుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలలో నిర్వహించే విధంగానే రామతీర్థంలో కూడా ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఆలయంలోని సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ సమయంలో తిరుమల నుంచి వేంకటేశ్వరస్వామి వారి విగ్రహాన్ని తీసుకువచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. ఏటా ఆ విగ్రహం వద్దనే బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. వేంకటేశ్వరస్వామివారి కల్యాణం కోసం తిరుమల దివ్యక్షేత్రం నుంచి పట్టువస్త్రాలు తీసుకొస్తారు. రామతీర్థంలో బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు కోరారు.



- విజయనగరానికి చెందిన కనకల మురళీ శ్రావణమాసంలో కుటుంబసభ్యుల కోరిక మేరకు కారు కొనుగోలు చేశాడు. దాని ఖరీదు రూ.13.80 లక్షలు. అప్పట్లో జీఎస్టీ 28 శాతంగా ఉండేది. ఈ లెక్కన రూ2.50 లక్షలు జీఎస్టీ రూపంలోనే చెల్లించాడు. సోమవారం నుంచి వాహనాలపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గడంతో అదే కారుపై జీఎస్టీ రూ.1.03,800 తగ్గింది. ఈ విషయం తలుచుకుని మురళీ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- గజపతినగరానికి చెందిన ఓ కుటుంబంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు ఉన్నారు. నెలరోజులకు ఒకసారి మందులు కొనుగోలు చేసుకుంటారు. ప్రతినెలా రూ.10 వేల విలువ చేసే మందులు కొంటారు. మందులపై 5 నుంచి 12 శాతం జీఎస్టీ ఉండేది. ఇప్పుడే పూర్తిగా జీఎస్టీ తొలగించడంతో ఆ కుటుంబానికి రూ.1000 వరకూ ఆదా కానుంది.

ఊరటే..

- తొలి రోజు తక్కువ జీఎస్టీని చెల్లించిన వినియోగదారులు
- 375 వస్తువులపై జీఎస్టీ తగ్గింపు
- ప్రధాన రంగాల్లో కనిపించిన అమలు
- చిన్న చిన్న వస్తువులకు పాత ధరలే
- అవగాహన పెంచేందుకు వాణిజ్య పన్నుల శాఖ సిద్ధం

విజయనగరం/ క్రైం/రింగురోడ్డు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. తొలిరోజు సోమవారం కొందరు వినియోగదారులు వివిధ వస్తువులపై తక్కువ ధర చెల్లించారు. గతంలో ఉన్న ధరతో పోల్చుకుని ఆనందపడ్డారు. ప్రధాని మోదీ జీఎస్టీ తగ్గించడంపై సోమవారం కీలక ఆదేశాలు ఇచ్చారు. దాదాపు 375 రకాల వస్తువులపై జీఎస్టీని (మిగతా 8వ పేజీలో..)

రూ.8వేలు తగ్గింది

కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాలపై జీఎస్‌టీ తగ్గించడం చాలా ఆనందంగా ఉంది. 8 వేల నుంచి 18 వేల వరకూ మోటారు వాహనాలపై జీఎస్టీ తగ్గింపు వల్ల వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతోంది. ఈ రోజే వాహనాన్ని కొనుగోలు చేశాను. టూ వీలర్‌పై రూ.8 వేల వరకూ తగ్గింది.

- ఎస్.సువర్ణ, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు





జాతీయ రహదారిని అనుకొని ఉన్న అప్పలరాజు చెరువును పూడ్చేసి చదును చేసిన దృశ్యం

చెరువేదీ?

ఎయిర్‌పోర్టు, రాబోతున్న బీచ్ కారిడార్, నేషనల్ హైవే ఉన్న భోగాపురాన్ని ఓ నిధిగా భావిస్తున్న అక్రమార్కులు ఎక్కడ ఖాళీ భూమి దొరుకుతుందా... కాజేద్దామా.. అని కాసుకూర్చుంటున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి జాతీయ రహదారి వరకూ దేనినీ వదలడం లేదు. తాజాగా హైవే పక్కనున్న చెరువును మాయం చేసేశారు. అమటాం రాయవలస పంచాయతీ నారుపేట గ్రామ సమీప జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సుమారు రూ.10కోట్లు విలువ చేసే చెరువును మట్టి, గ్రావెల్‌తో పూడ్చేసి అమ్మకానికి కూడా ప్రయత్నాలు మొదలెట్టేశారు. ఈ భూ దందాను రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో వారికే తెలియాలి.

- జాతీయరహదారి ఆనుకొని ఉన్న చెరువు కబ్జా
- విలువ సుమారు రూ.10కోట్లు
- అమ్మకానికి ప్రయత్నాలు
- భూ దందాను పట్టించుకోని రెవెన్యూ

భోగాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఓ పక్క చురుగ్గా నిర్మాణమవుతున్న అంతర్జాతీయ విమానాశ్రయం మరో పక్క రాబోతున్న బీచ్ కారిడార్, ఇంకో వైపు నేషనల్ హైవేతో భోగాపురం దశ మారుతోంది. చుట్టు పక్కల ప్రాంతాల్లోని భూముల ధరలు సైతం ఊహాతీతంగా పెరుగుతున్నాయి. ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు ఖాళీ ప్రభుత్వ భూములపై పడుతున్నారు. దర్జాగా పాగా వేసి అమ్మకాలకు దిగుతున్నారు. ఈ క్రమంలో శ్మశాన వాటికలు, చెరువులు, గెడ్డలు, వాగులు, పంట కాలువలు సైతం పూడ్చేసి ఆక్రమించుకొంటున్నారు. ఈ వ్యవహారాల్ని నిరంతరం గ్రామాల్లో పర్యటించే రెవెన్యూ అధికారులు, సిబ్బంది చూస్తున్నా కనీసం (మిగతా 8వ పేజీలో..)



రోడ్డు వరకు చదును చేసిన దృశ్యం

పైడిమాంబకు నేడు ఘటాభిషేకం

- నగరంలోని పలు ప్రాంతాల నుంచి చేపట్టనున్న ఊరేగింపులు



విజయనగరం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భక్తులు తలపై ఘటాలు ఎత్తుకుని జై పైడిమాంబ అంటూ నామస్మరణతో విజయనగరం మంగళవారం మార్మోగనుంది. పైడిమాంబకు ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ఎక్కువ ప్రాంతాల నుంచి మంగళవారం ముర్రాటలు సమర్పించనున్నారు. అక్టోబరు 6 నుంచి పైడిమాంబ పండుగ నేపథ్యంలో మిగిలే రెండు మంగళవారాల్లో భారీగా భక్తులు తరలిరానున్నారు. ముర్రాటలు సమర్పించే ఊరేగింపులో శక్తివేషాలు, సాముగారడీలు, పులివేషాలు, విచిత్ర వేషాలు సందడి చేయనున్నాయి. ఇందుకోసం నిర్వాహకులు లక్షలాది రూపాయలు వ్యయం చేయనున్నారు. నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల నుంచి మంగళవారం ముర్రాటలు సమర్పిస్తారు. అన్ని ప్రధాన కూడళ్లలో మంగళవారం ఉత్సవ వాతావరణం కన్పించనుంది.

- పైడిమాంబకు ముర్రాటలు సమర్పించే తంతుపై ఆయా ప్రాంతాల నుంచి దేవదాయశాఖకు విన్నపాలు రావడంతో మంగళవారం సాధారణ రోజుల కంటే అధికంగా మూడు గంటలు ఆలయం తెరిచి వుంచనున్నారు.







ఉపాధి హామీ.. ఈ పేరు చెబితేనే ప్రజల్లో ఒకరకమైన అపవాదు ఉంది. కొన్ని శాఖల మాదిరిగానే అవినీతి శాఖగా ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. గ్రామంలో క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ పంచుకుంటున్నారన్న ఆరోపణ ఉంది. ఇటీవల సామాజిక తనిఖీ సమయంలో కొత్తవలసలో ఓ ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌కు జరిమానా విధించారు. అయితే ప్రతిచోటా ఇలాంటి లోపాలుంటున్నాయి. కానీ కొన్నిచోట్లే బయటకు వస్తున్నాయి. సామాజిక తనిఖీ చేపట్టిన అధికారులు, సిబ్బందికి మామూళ్లు అందిన చోట్ల లోపాలు అంతగా బయటకు రావని అంతా చెప్పుకుంటున్నారు.

వారికి భలే ఉపాధి

- కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకూ అక్రమాలు
- సామాజిక తనిఖీలోనూ చేతివాటం
- చేయి తడిపితే అంతా సక్రమం
- తూతూమంత్రంగా జరిమానాలు
- రికవరీలూ లేవు

రాజాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఏడాది మూడు విడతల్లో ఉపాధి హామీ సామాజిక తనిఖీలు జరిగాయి కానీ లోపాలను అంతంతమాత్రంగా గుర్తించారు. రికవరీలూ అంతే. తనిఖీల్లో పెద్ద ఎత్తున సొమ్ము చేతులు మారినట్టు ఆ శాఖ నుంచే ఆరోపణలు వినిపించాయి. రూ.కోటి పనులు జరిగిన పంచాయతీల్లో తనిఖీ అధికారులకు సంబంధించి డీఆర్పీలు అడుగుపెడితే రూ.10 వేలు ముట్టజెప్పారట. రూ.కోటి దాటితే రూ.18 వేలను ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఒక్కో మండలం నుంచి జిల్లాస్థాయి అధికారికి రూ.50 వేలు, మరో అధికారికి రూ.50 వేలు కేవలం తనిఖీ సమయాల్లో అందించారట. ఆయా మండలాల్లో పనిచేసే ప్రధాన అధికారి వసూలు చేసి ఇచ్చారట. ఇది స్వయగా ఆ శాఖ వర్గాలే అంతర్గత సమావేశాల్లో చెప్పుకున్నారు. దీనినిబట్టి ఏ స్థాయిలో అవినీతి జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ అవినీతి ప్రభావం పనులతో పాటు పనులు చేసే వేతనదారులపై కూడా పడుతోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి సామాజిక తనిఖీ ప్రారంభమైంది. జరిమానాలు విధిస్తున్నారు. కానీ ఆ స్థాయిలో రికవరీలు లేవని ఉపాధి హామీ సిబ్బంది చెబుతున్నారు. జిల్లాలో (మిగతా 8వ పేజీలో..)

దృష్టి పెట్టాం

ఉపాధి హామీ పథకంలో నిర్లక్ష్యానికి తావులేదు. ఈ విషయంలో అధికారులతో పాటు సిబ్బందికి ఆదేశాలిచ్చాం. ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందే. పని ప్రదేశంలో ఉండి పనులు చేయించాల్సిందే. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. సామాజిక తనిఖీలు సక్రమంగా చేయని సిబ్బందిపై కూడా చర్యలుంటాయి. రికవరీలు కూడా చేస్తాం.

- శారదాంబ, డ్వామా పీడీ, విజయనగరం

వచ్చే ఐదు రోజుల్లో భారీ వర్షాలకు అవకాశం

- అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజుల్లో జిల్లాలోని కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిందని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం పీజీఆర్ఎస్ అనంతరం జిల్లాలో వాతావరణ పరిస్థితులపై సమీక్షించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం అక్షర వాచకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మరో 1,10,915 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ అక్షరాంధ్ర లక్ష్యమని స్పష్టం చేశారు. డీఆర్‌డీఏ ద్వారా 60,715 మంది, మెప్మాద్వారా 12 వేల మంది మహిళలు, డ్వామా ద్వారా 38,200 మంది పురుషులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టరు సూచించారు.

- జిల్లాలో స్వచ్ఛాంధ్ర ర్యాంకు మెరుగుపడేలా అధికారులు పనిచేయాలని (మిగతా 8వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

కొలువుదీరిన దుర్గమ్మ

● శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణాలు, పల్లెల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకొని.. పూజలు చేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం


చీపురుపల్లి: స్వర్ణ కవచ అలంకారంలో కనకమహాలక్ష్మి అమ్మవారు


రాజాం రూరల్: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


జామి: పైడితల్లమ్మ శక్తిపీఠంలో...


సాలూరు రూరల్: కామాక్షి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు


కోటలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న రాజ వంశీయులు, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్

కురుపాం కోటలో...

కురుపాం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కురుపాం కోటలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజవంశీయులు, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ కుటుంబ సమేతకంగా కోట దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన పురోహితులు కోటలో గల ఆయుధాలను మేళ తాళాలతో పల్లకిపై ఊరేగింపుగా వెళ్లి దుర్గమ్మ గుడిలో అలంకరించారు. పూజల్లో కిషోర్ చంద్రదేవ్ సతీమణి ప్రీతిదేవి, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్‌కుమార్ దేవ్ కోట, రావాడ రోడ్డు కూడలిలోని కోట దుర్గమ్మ ఆలయంలో పూజలు చేశారు.


కొత్తవలస: కొత్తవలస-విజయనగరం రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద భక్తుల పూజలు


రాజాం: దుర్గాదేవిని కలశాలతో ఊరేగిస్తున్న దృశ్యం


పాలకొండ: కోటదుర్గమ్మ ఆలయంలో పట్టువస్త్రాలతో ఎమ్మెల్యే జయకృష్ణ దంపతులు


వంగర: రుషింగిలో ఊరేగింపుగా..


బొండపల్లి: అంబటివలసలో..


సంతకవిటి: పూజల్లో పాల్గొన్న భక్తులు


ఎస్.కోట: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో రంగుల విద్యుద్దీపాలంకరణ


గుర్ల: గుజ్జింగివలసలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

స్ఫూర్తిప్రదాత.. గురజాడ

మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్' అని చాటిచెప్పిన గురజాడ స్ఫూర్తి ఎప్పటికీ సజీవమమేని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో గురజాడ జయంతిని నిర్వహించారు. ముందుగా మహాకవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యానికి ఉన్న శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహాకవి గురజాడ అప్పారావు అని తెలిపారు. కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ రచనలతో నేటి సమాజ స్థితిగతులను ఆనాడే ప్రజలకు తెలియజేశారని కొనియాడారు. ఆయన రచనలు నిత్య నూతన మన్నారు. ముందు చూపుతో గొప్ప రచనలు చేశారని తెలిపారు. తెలుగు సాహిత్యంలో వాడుక భాష , సమాజ సంస్కరణకు ఎంతో కృషి చేశారన్నారు. నేటి తరం ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాల న్నారు. అనంతరం పలువురు చిన్నారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేసీ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత, వక్తలు గంట్యాడ గౌరునాయుడు, చింతా అప్పలనాయుడు, స్వామినాయుడు, శివాజీ, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.


గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి

● ఎస్పీ ఏఆర్ దామోదర్


ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి... న్యాయం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 31 ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించి 8, కుటుంబ కలహాలకు సంబంధించి 4, మోసాలకు పాల్పడినట్టు 5, నగదు వ్యవహారానికి సంబంధించి ఒకటి, ఇతర అంశాలకు సంబంధించి 13 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్టయితే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు ఏవీ లీలారావు, సుధాకర్, ఎస్ఐ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.


వీఆర్ఎస్ జలాశయం నుంచి విడుదల చేస్తున్న వరదనీరు

సువర్ణముఖికి వరద ఉధృతి

మక్కువ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సంబర గ్రామ సమీపంలోని వెంగళరాయసాగర్ జలాశయంలోకి వరదనీరు వచ్చి చేరుతుండటంతో సువర్ణముఖి నదిలోకి 400 క్యూసెక్కుల నీటిని సోమవారం విడిచిపెట్టారు. వర్షాలు కురుస్తున్నందున వరదనీరు పెద్దఎత్తున జలాశయంలోకి వచ్చి చేరుతుండటంతో సువర్ణముఖి నదిలోకి విడిచిపెడుతున్నాయని ఇరిగేషన్ జేఈ రాజశేఖర్ తెలిపారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నదీ ప్రవాహం ఎక్కువ కావడంతో డబ్బారువలస గ్రామానికి నదిలోంచి వెళ్లడానికి వీలు కాకపోవడంతో ప్రజలు స్థానిక చర్చి జంక్షన్ మీదుగా మూడు కిలోమీటర్లు నడిచివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అసెంబ్లీలో సమస్యల ప్రస్తావన

శాసనసభ సమావేశాల్లో జిల్లాలోని ఎమ్మెల్యేలు సమస్యలు ప్రస్తావించారు. సోమవారం ఆయా నియోజకవర్గాల పరిధిలోని సమస్యలు వివరించారు. జిల్లాలో సమస్యలు పరిష్కరించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత మంత్రులను కోరారు.

షెడ్యూల్డ్ జాబితాలో చేర్చేందుకు ప్రతిపాదనలు

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

పార్వతీపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాల జాబితాలో చేర్చేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం అసెంబ్లీలో ప్రకటించారు. జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలు కూడా షెడ్యూల్డ్ గ్రామాలుగా మారే అవకాశం ఉందన్నారు. రెండు ఐటీడీఏల పరిధిలో నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించాలని, కొన్ని దశాబ్దాలుగా గిరిజనులు, గిరిజన సంఘాల నేతలు కోరుతున్నారన్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారుల నుంచి వెళ్లినా గత ప్రభుత్వాలు ఎటువంటి ప్రకటన చేయలేదన్నారు. ఐటీడీఏల ప్రాంతాల్లోని గ్రామాల్లో 50 శాతం పైబడి గిరిజనులు ఉంటే ఆ గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించే ప్రక్రియపై సంబంధిత ప్రాజెక్టుల అధికారులు, కలెక్టర్ నుంచి నివేదికలు కోరామన్నారు.

అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయండి

● విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అసెంబ్లీలో సోమవారం ప్రస్తావిం చారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయగలిగితే కేంద్రాల నిర్వహణకు ఇబ్బందులు తొలగుతాయన్నారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న విప్ తోయక జగదీశ్వరి

నాలుగులేన్లగా రోడ్డుగా విస్తరించండి

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం-రాయగడ రాష్ట్రీయ రహదారిని నాలుగులేన్లగా విస్తరించాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. సోమవారం నిర్వహించిన అసెంబ్లీ సమావేశంలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం నుంచి పొందూరు, రాజాం, తెర్లాం, బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి, పార్వతీపురం మన్యం ప్రాంతం మీదుగా రాయగడ వెళుతున్న సుమారు 130 కిలోమీటర్ల రాష్ట్రీయ రహదారితో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. వాహనాల రద్దీ దృష్ట్యా దీనిని నాలుగులేన్లగా విస్తరించడం చాలా అవసరమన్నారు. అలాగే బొబ్బిలి పట్టణ పరిధిలో మార్కెట్ రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సభలో ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వం పారాది వద్ద వేగావతి నదిపై వంతెన పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. బొబ్బిలి నియోజకవర్గ రోడ్లపై పడుతోందని సభ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ మంత్రిని కోరారు.

చక్కెర పరిశ్రమను తెరిపించండి

● ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం లచ్చయ్యపేటలోని ఎన్‌సీఎస్ చక్కెర పరిశ్రమను తెరిపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బో నెల విజయచంద్ర కోరారు. సో మవారం నిర్వహించిన అసెం బ్లీ సమావేశంలో చెరకు రైతుల సమస్యలను ఆయన ప్రస్తా వించారు. పార్వతీపురం, బొబ్బిలి నియోజకవర్గాల రైతులు చెరకు అధికంగా పండించేవారన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎన్‌సీఎస్ చక్కెర పరిశ్రమ మూతపడిందన్నారు. అందులో పనిచేసిన ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యూటీ ఇతర బకాయిలు చెల్లించలేద న్నారు. ఈ పరిశ్రమలో పనిచేసిన పీఎఫ్ హోల్డర్స్, సీనియర్ ఉద్యోగులు ఒక్కొక్కరిగా మృతి చెందుతుండడంతో వారి కు టుంబాలకు బెనిఫిట్స్ అందే అవకాశం లేకుండా పోతోందన్నారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యూటీ మంజూరు, ఉద్యోగులను కొనసాగించడానికి సంబంధిత మంత్రి, కార్మిక శాఖాధికారులు వచ్చి పరిశీలించాలని కోరారు.

అర్జీదారులకు సరైన సమాధానం ఇవ్వాలి

● కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు సరైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి వినతులు చూడాలని చెప్పారు. రీ ఓపెన్ కేసులపైనా పూర్తిగా విచారణ చేపట్టి ముగించాలని తెలిపారు. గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని, లేని పక్షంలో సంబంధిత అధికారుల పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, మురళి, ప్రమీల గాంధీ తదితరులు పాల్గొన్నారు. వచ్చిన వినతుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 106, పంచాయతీరాజ్ కు 15, పింఛన్లు, ఇతర అంశాలపె 28, మున్సిపాల్టీకి 9, విద్యాశాఖకు 2, హౌసింగ్ 2, వైద్య శాఖకు 11, విద్యుత్ శాఖకు సంబంధించి 5 వినతులు ఉన్నాయి.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలి

ప్రతి సోమవారం వస్తున్న వినతులను పరిష్కరించి... ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా చూడాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మ్యూటేషన్, 1బీ నమోదు, భూముల స్వరూపంపై తహసీల్దారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యలను క్లిష్టతరం చేయకుండా సులభతరంగా చేసి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. మాజీ సైనికులకు కేటాయించిన భూములపై నిబంధనలు పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ రోజు పీజీఆర్ఎస్‌కు ఎక్కువ శాతం రెవెన్యూకు సంబంధించిన దరఖాస్తులే వచ్చినట్లు కలెక్టరు తెలిపారు. వారానికి కనీసం 2.5 శాతం వృద్ధి సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ కొన్ని పిటిషన్లు 100 రోజులు ఎస్ఎల్ఏకి మించి సమయం ఉన్నప్పటికీ 15-20 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, నోడల్ అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో...

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు వచ్చాయి. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య వినతులు స్వీకరించారు. ఇంజనీరింగు, ప్రణాళికా విభాగాలకు సంబంధించి రెండు వినతులు అందాయి. వీటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత విభాగాధిపతులను కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ హరిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య హక్కులు కల్పించండి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తాము సాగు చేస్తున్న ఇనాం భూములకు సంపూర్ణ భూ యాజమాన్యపు హక్కులు కల్పించాలని చీపురుపల్లి మండలం జి.అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద రైతులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తాము తాతముత్తాలు నుంచి ఆ భూమిని సాగు చేస్తున్నామని తెలిపారు. 375 మంది రైతుల ఈ భూమిపైనే జీవనం సాగిస్తున్నాయని చెప్పారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరారు.

వేతన బకాయిలు చెల్లించండి

తమకు బకాయి ఉన్న జీతం ఇవ్వాలంటూ గ్రీన్ అంబాసిడర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుడు ప్రమాదవశాత్తూ మరణిస్తే ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు మంజూరు చేయాలని కోరారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

పని గంటల పెంపు యోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ శాసన సభ 8 గంటలు పనిదినాన్ని 13 గంటలకు పెంచిందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కనీస వేతనాలు చట్ట సవరణ చేసి బోర్డు నియమించాలని కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పోలీసు శిక్షణ కేంద్రంలో వసతులు కల్పించండి: ఎస్పీ


శిక్షణ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సారిపల్లిలోని పోలీసు శిక్షణ కేంద్రంలో త్వరితగతిన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. తరగతి గదులు, వంటగది, పరేడ్ గ్రౌండ్, వాటర్ ప్లాంట్, డైనింగు హాల్‌తో పాటు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి త్వరలో 140 మంది కానిస్టేబుళ్లు శిక్షణ నిమిత్తం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణ కూడా త్వరలో ప్రారంభం కానుందన్నారు. శిక్షణ కేంద్రంలో మంచినీటి సమస్య లేకుండా చూడాలని, నగర పాలక సంస్థ అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, డీఎస్పీ వీరకుమార్, సీఐలు ఏవీ లీలారావు, రామకృష్ణ, లలిత, చంద్ర శేఖర్, ఆర్ఐ గోపాలనాయుడు, ఎస్ఐలు గణేష్, విక్రమ్, రామగణేష్, దేవి, డీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కమిషనర్ పర్యటన

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. పైడిమాంబ, విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో నగరంలో వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. డివైడర్లకు రంగులు అద్దే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం అన్న క్యాంటీన్‌కు చేరుకుని అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ముగ్గురు ఎంపిక

లక్కవరపుకోట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చందులూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. వీరు 23 నుంచి 25 వరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన లావణ్య, రుచిత, దేవేంద్రలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

బోర్లు మంజూరు చేయండి

నెల్లిమర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జరజాపుపేట హౌసింగ్ బోర్డు కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రెండు బోర్లు మంజూరు చేయాలని సోమవారం ప్రజాఫిర్యాదుల విభాగంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్, వైసీపీ పార్టీ అధికార ప్రతినిధి సముద్రపు రామారావు కౌన్సిల్ సభ్యులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ 17, 18, 19 కౌన్సిలర్ల ప్రతినిధులు మద్దిల వాసు, నల్లి శ్రీను, టి.నారాయణమూర్తి, శివప్రసాద్ పాల్గొన్నారు.

స్థానికంలో సత్తా చాటాలి

రాజాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గ్రామాలలో ప్రజలకు వివరించి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ శర్మ సూచించారు. ఉంగరాడ మెట్టవద్ద ఒక ప్రవేటు కార్యక్రమానికి హాజరైన ఆయనను రాష్ట్ర నీటి పారుదల శాఖ డైరెక్టర్ కోటగిరి నారాయణరావు, రాజాం టౌన్ ప్రెసిడెంట్ జొన్నాడ రంజిత్, జిల్లా కార్యదర్శి గుడివాడ నాగరాజు, జిల్లా మహిళా మోర్చా నాయకురాలు లింగం శారద, చిన్నంనాయుడు, పాలవలస సింహాచలం, నీలయ్య, తదితరులు కలిశారు. జీఎస్టీ సవరణతో రాష్ట్రంలో వేలాది మంది పేదలకు న్యాయం జరుగుతుందని రాజేష్ శర్మ అన్నారు.

స్కౌట్ మాస్టర్‌గా శిక్షణ

వేపాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో నిర్వహించిన భారత్ స్కౌట్స్, గైడ్స్ అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్ శిక్షణ కార్యక్రమంలో సోంపురం ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పి.రమేష్ నాయుడు పాల్గొన్నారు. ఆయనను హెచ్‌ఎం బీవీఏ రాజు అభినందించారు.

ఆర్‌ఐగా వేణుగోపాలకృష్ణ

భోగాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భోగాపురం రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వేణు గోపాలకృష్ణ అదే కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అక్కడి ఆర్‌ఐగా ఇమ్రాన్ సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. వీరిని తహసీల్దార్ రమణమ్మ, హెచ్‌డీటీ హరి, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, తదితరులు అభినందించారు.

ఇన్‌చార్జి ఆర్‌ఐగా గిరి

రేగిడి, సెప్టెంబరు 22,(ఆంధ్రజ్యోతి): రేగిడి మండల ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా కోట గిరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ, ఆర్‌ఐగా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

క్షేత్ర సహాయకులను నియమించండి

భోగాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలిపల్లి గ్రామానికి ఉపాధి హామీ పథకానికి సంబంధించి క్షేత్ర సహాయకులను నియమించాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కర్రోతు సత్యనారాయణ సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవో గాయత్రిని కోరారు. గతంలో చేసిన ఎఫ్ఏ అక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలతో తొలగించారని తెలిపారు. దీంతో సుమారు ఇదు నెలలుగా అక్కడ మేట్ చందక భవాని క్షేత్ర సహాయకుల విధులు నిర్వహిస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కొత్తవారిని నియమించాలని కోరారు. గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన కవులవాడ, లింగాలవలస క్షేత్ర సహాయకులను తొలగించారని...మళ్లీ ఎలా చేర్చుకున్నారని ఏపీవో భాగ్యలక్ష్మిని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే కోండ్రుకు 'పీపుల్‌స్టార్' కృతజ్ఞతలు


మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి

రాజాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీపుల్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో రూపొందిన 'యూనివర్సిటీ' చిత్రం స్థానిక సీతారామ థియేటర్‌లో ప్రదర్శితమవుతోంది. సోమవారం మ్యాట్నీ షో మొత్తం టికెట్స్‌ను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుక్‌చేసి... ప్రేక్షలకు ఉచితంగా చూపించారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యే కోండ్రుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటరీ బీసీసెల్ అధ్యక్షులు గురవాన నారాయణరావు, ఆగూరు అప్పలనాయుడు, ఎగిరెడ్డి శంకర్, రౌతు వెంకటరమణ, బూరాడ సతీష్, జగన్మోహన్‌రావు, కోటగిరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం ఉత్సవాలలో డ్వాక్రా బజార్


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస్

విజయనగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలు, పైడిమాంబ పండుగ సందర్భంగా సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సరస్-2025 పేరిట అఖిల భారత డ్వాక్రా బజారు నిర్వహించనున్నట్టు పీడీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో డీపీఎంఎస్, ఏపీఎంఎస్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జంక్షన్, ట్యాంకు బండ్ రోడ్డులో దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 250 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 28 నుంచి అక్టోబరు 8 వరకూ మహిళా సంఘాల తయారు చేసే ఉత్పత్తి, అమ్మకాలు, ప్రదర్శన చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ కె.సావిత్రి, ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, అకౌంట్ అధికారి దొర పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పురిటిపెంట గ్రామంలోని సంతతోట కాలనీలో ఎక్సైజ్‌శాఖ సీఐ జనార్దనరావు ఆధ్వర్యంలో సోమవారం దాడులు చేసి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కాలనీకి చెందిన బ్రహ్మం బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో మద్యం సీసాలు పట్టుబడినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ నరేంద్రకుమార్, హెచ్‌సీ బాషా తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

బొండపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బిల్లలవలస జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారి 26పై వేగంగా వస్తున్న లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. గజపతినగరం వైపు నుంచి విజయనగరం వెళుతున్న లారీ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. సమీపంలో వివిధ షాపులు కూడా ఉన్నాయి. లారీ షాపులోకి దూసుకొని వెళితే పలువురు ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఎవరికీ ఏమీ నష్టం కలగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కళింగాంధ్ర చరిత్ర ఎంతో విశిష్టమైనది


కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రగా పిలవబడే కళింగాంధ్ర చరిత్ర చాలా విశిష్టమైనదని వక్తలు కీర్తించారు. సోమవారం స్థానిక కళాశాలలో కళింగాంధ్ర కవిత సంకలనాన్ని ప్రిన్సిపాల్ చౌదరి రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు, కళింగాంధ్రలో గురజాడ, గిడుగు, తాపీ ధర్మారావు, కోడి రామూర్తి వంటి ఘనులు జన్మించారని గుర్తు చేశారు. ఇక్కడి యాస, భాష ప్రత్యేకమైనదని అన్నారు. విద్యార్థులు తమ నేల చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకొని గొప్ప వ్యక్తులుగా మారాలని హితవు పలికారు. పుస్తకాన్ని సిక్కోలు బుక్ ట్రస్ట్ అధ్యక్షుడు దుప్పల రవికుమార్ పరిచయం చేశారు. కళింగాంధ్రకు చెందిన 72 మంది కవులు రచించిన 130 కవితలు ఇందులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, నేతేటి గణేశ్వరరావు, పిల్లా తిరుపతిరావు, తురంగి విశ్వనాథం, అప్పన్న, కుదమ తిరుమలరావు, పెంకి చైతన్యకుమార్, మూడడ్ల శ్రీనివాసరావు, సమతం మహేశ్వరరావు, పడాల కవీశ్వరరావు, పారుపల్లి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైతుల అభివృద్ధికి సహకరించాలి: నాగార్జున


శ్రీనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కిమిడి నాగార్జున

విజయనగరం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుల అభివృద్ధికి సహకరించాలని ఆప్కాబ్ ఎమ్‌డీ శ్రీనాథ్‌రెడ్డిని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కిమిడి నాగార్జున కోరారు. సోమవారం అమరావతిలో శ్రీనాథ్‌రెడ్డిని కలిసి జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పంట రుణాల కోసం అదనంగా జిల్లాకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం 5శాతంగా ఉన్న జనరల్ బ్యాంకింగ్ పరిమితికి అదనంగా మరో ఐదు శాతం పెంచాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరికరాలు అందించడానికి సహకరించాలని నాగార్జున కోరారు. రైతుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబాలకు సాయం


బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, సెప్టెంబరు 22(ఆంధ్ర జ్యోతి): వర్లాపల్లి గ్రామంలో ఈ నెల 7న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 5 కుటుంబాలకు చెందిన పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సమక్షంలో శారదా కంపెనీ సోమవారం సాయం అందించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విపత్తుల సమయంలో స్థానిక కంపెనీలు ఉదారంగా వ్యవహరించాలని కోరారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల నగదు, 25 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు, రగ్గులు, దుప్పట్లు, వంట సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, సర్పంచ్ గోగాడ సత్యం, జి.రామారావు, శారదా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా నగదు అందజేత

తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొని ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎస్.కోట పట్టణ గౌరీనగర్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త నాగభూషణం కుటుంబానికి ఎమ్మెల్యే లలితకుమారి సోమవారం తమ నివాసంలో రూ.5 లక్షల ప్రమాద బీమా నగదును అందజేశారు. టీడీపీ కార్యకర్తల కుటుంబానికి పెద్దదిక్కుగా చంద్రన్న ఉండగా ఎవరికీ అన్యాయం జరగదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేబీఏ రాంప్రసాద్ , జీఎస్ నాయుడు, చంద్రశేఖర్, రామసత్యం, మల్లేశ్వరరావు, రమణాజీ, చెల్లయ్య, కోటి, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'విజేత'కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు


డీఎస్సీ విజేతలను సత్కరిస్తున్న కమిషనర్, సీఐ

రాజాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజాం విజేత కోచింగ్ సెంటర్ మెగా డీఎస్సీలో మంచి ఫలితాలు సాధించడంతో రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, పట్టణ సీఐ అశోక్‌కుమార్‌లు అన్నారు. సోమవారం విజేత కోచింగ్ సెంటర్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా విజేత కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న అప్పలరాజు, శ్రీదేవిలను అభినందించారు. ఈ ఏడాది డీఎస్సీలో 200 మంది పిల్లలకు గాను 160 మందికి ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం డీఎస్సీ విజేతలనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రసాదరావు, వైదుర్గారావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, పక్కి వాసు, కొత్త సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, హరిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఘోషాసుపత్రిలో మొక్కలు నాటిన అధికారులు


మొక్కలు నాటిన అరుణా శుభశ్రీ

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):ఘోషాసుపత్రి ప్రాంగణంలో విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో మామిడి, పనస, జామ జాతులకు చెందిన సుమారు 60 రకాల హైబ్రిడ్ మొక్కలను గైనకాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ అరుణా శుభశ్రీ సోమవారం సిబ్బందితో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనం పెంపు ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు రోగులకు స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. ఆసుపత్రికి వచ్చేవారికి నీడతో పాటు పండ్లను కూడా అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న బంగార్రాజు

భోగాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి గ్రామంలో సోమవారం నిర్వహింతచిన దుర్గాదేవి ఉత్సవాల్లో మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు కుటుంబంతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, కర్రోతు రాజు, పైడిరాజు, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన


రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

గుర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం గుర్లలో రైతులు గందరగోళం సృష్టించారు. అధికారులు, పోలీసు యంత్రాగం ఉన్నప్పటికీ కనీసం రైతులు పట్టించు కోలేదు. రైతుల కోసం చీటీలు రాసినా కనీసం పట్టించు కోలేదు. తమకు యూరియా వెంటనే ఇవ్వాలని.. లేదంటే రోడ్డుపై వాహనాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. వచ్చిన సరుకులను పట్టుకు వెళ్లాలన్న ఆలోచనకంటే ఆందోళన చేయడమే మంచిదని కొంతమంది ఇబ్బందులు పెడుతున్నారని మిగతా రైతులు వాపోయారు. వీటిపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలన్నారు.

అధికారుల సమక్షంలో పంపిణీ

బొండపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బొండపల్లిలో సోమవారం రైతుసేవా కేంద్రానికి వచ్చిన 10 టన్నుల యూరియాను రెవెన్యూ, పోలీసులు, వ్యవసాయశాఖ అధికారుల సమక్షంలో రైతులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ డోలా రాజేశ్వరరావుతో పాటు ఎస్ఐ యు.మహేష్, గజపతినగరం ఏడీఏ నిర్మలాజ్యోతి, ఏవో పీవీ మల్లికార్జునరావుల ఆధ్వర్యంలో రైతుకు ఒక బస్తా చొప్పున అధికారులు పంపిణీ చేశారు.

జీఎస్టీ సవరణలతో ఉపశమనం



సంతోషం వ్యక్తం చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

శృంగవరపుకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ఉపసంహరించడం ప్రజలకు పెద్ద ఉప శమనమని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ కొనియాడింది. ఎస్.కోట ఎల్.ఐ.సీ కార్యాలయం వద్ద సోమవారం ఈ శాఖ ఉద్యోగులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. గత ఏడాది ఉత్తరాంధ్రకు చెందిన పార్లమెంటు సభ్యులకు బీమా ప్రీమియంలపై జీఎస్టీను తొలగించాలని విన్నవించామన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఆ బిల్లును ఉపసంహరించుకోవాలి



ధర్నా చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

రాజాం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, ఉద్యోగులు, శ్రామికులు, మహిళల హక్కుల్ని కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడి నాలుగు రోడ్ల జంక్షన్‌లో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. పని గంటలను పెంచుతూ శాసనసభ ఆమోదించిన తీర్మానం కార్మికులకు ద్రోహం చేయడమేనని ఆరోపించారు. ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ధర్నాలో పలువురు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమీక్షించండి

నెల్లిమర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి అధి కారులు 2002 ఓటరు జాబితాపై సమీక్షించి... వారిలో ప్రస్తుతం బతికి ఉన్న వారి పేర్ల జాబితాను తయారు చేయాలని తహసీల్దార్ కె.శ్రీకాంత్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్‌వోలతో సోమవారం జరిగిన సమావేశంలో తహసీల్దార్ ఓటర్ల జాబితాలను బీఎల్‌వోలకు పంపిణీ చేశారు. ఈ నెల 25లోగా జాబితాలను కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు, రీసర్వే డీటీ సత్యనారాయణ, భాస్కరరావు, మహేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంపై కేసు నమోదు


దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

సంతకవిటి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓం శ్రీ వినాయక ట్రేడర్స్ దుకాణంపై 6ఎ కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సి.బి.యశ్వంత్‌రావు తెలిపారు. ఓం శ్రీ వినాయక ట్రేడర్స్ వారు ఎరువులను ఎమ్ఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్ముతున్నారని కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, వీఆర్‌ఓ బుచ్చిబాబుల ఆధ్వర్యంలో సోమవారం ఎరువుల దుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో డీఏపీ, ఎమ్.ఓ.పీ, కాంప్లెక్స్ ఎరువుల్లో 23 బస్తాలు తేడా ఉందని గుర్తించారు. దాని విలువ రూ. 36 వేలు ఉంటుందని తెలిపారు. దీంతో రూ. 13,62,800 విలువ 42.70 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నట్టు ఏవో యశ్వంత్‌రావు తెలిపారు.

మా భూములు ఇప్పించండి


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న నిర్వాసితులు

ఎస్.కోట రూరల్ సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిందాల్ యాజమాన్యం 18 ఏళ్ల క్రితం తమ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని మోసం చేసిందని, తిరిగి తమ భూములు ఇప్పించాలని కలెక్టర్ రాంసుందర్ రెడ్డిని జిందాల్ నిర్వాసితులు కోరారు. ఈమేరకు పీజీఆర్ఎస్‌లో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు.

ఎట్టకేలకు సంకిలి వంతెనపై దృష్టి

రేగిడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలకొండ- విశాఖ ప్రధాన రహదారిలో ఉమ్మడిజిల్లాలను కలిపే అతి ముఖ్యమైన మార్గమైన సంకిలి నాగావళి నదిపై ఉన్న వంతెన మార్గంపై పాలకొండ అర్అండ్‌బీ అధికారులు ఎట్టకేలకు దృష్టి పెట్టారు. ఈ నెల 19న 'ఆంధ్రజ్యోతి'లో 'సంకిలి వంతెనపై జాగ్రత్త సుమీ' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. దీనిపై పూడికలను తొలగించారు. వంతెనపై పరిశుభ్రత చర్యలు చేపట్టారు.

ముగిసిన విశ్వకర్మ జయంత్యుత్సవాలు

చీపురుపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విశ్వకర్మ జయంత్యుత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా విశ్వకర్మ చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బోనుమద్ది వీరాచారి, మారోజు చక్రధర్, పట్నాన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దత్తిరాజేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా షికారుగంజి గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 110 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.రఘు, సర్పంచ్ సుంకర వెంకటరావు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డీవీ గిరిబాబు, ఎంపీహెచ్‌వో బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

చెరువేదీ?

(ఐదో పేజీ తరువాయి)

పట్టించుకోవడం లేదు. అమటాం రాయవలస పంచాయతీ నారుపేట గ్రామ సమీపంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లే జాతీయ రహదారిని ఆనుకొని సర్వే నెంబరు 11/1లో ఎకరా 79 సెంట్ల విస్తీర్ణంతో అప్పలరాజు చెరువు ఉండేది. ఈ చెరువును కొంత కాలంగా ఆక్రమించుకొంటూ వస్తున్నారు. చెరువులో చెత్త వేయడం, పనికిరాని వస్తువులు పడేయడం, ఉపయోగ పడని గృహ నిర్మాణ సామగ్రి తదితర వాటిని పడేస్తూ చెరువును ఆక్రమించుకొంటు వచ్చారు. రెండు రోజుల క్రితం చెరువులోకి పూర్తిగా మట్టి తరలించి పూడ్చేసి చదును చేసేశారు. జాతీయ రహదారిని ఆనుకొని ఆక్రమణకు గురైన చెరువు విలువ సుమారు రూ.10కోట్లకు పైగా ఉంటుంది. చెరువును పూడ్చేసి అమ్మకాలకు పెట్టినట్లు సమాచారం. ఇదంతా నిరంతరం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్న జాతీయరహదారిని ఆనుకొని ఉన్న ప్రాంతంలో జరగడం గమనార్హం. ఇదే రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న రెవెన్యూ శాఖకు ఎందుకు కనిపించలేదో అర్థంకావడం లేదు. ఇదంతా గతంలో వైసీపీలో ఉన్న ఓ నాయకుడు చేస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. హైవేను ఆనుకొని ఉన్న చెరువును పూడ్చేస్తే చూడని అధికారులు మిగతా ప్రాంతాల్లో ఏవిధంగా గుర్తించగలరంటూ స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్లే జాతీయరహదారిని ఆనుకొని ఉన్న శ్మశానవాటికను కూడా ఆక్రమించుకొంటున్నారని పలువురు చెబుతున్నారు. చెరువు ఆక్రమణపై తహసీల్దార్ రమణమ్మను వివరణ కోరగా ఆక్రమణను పరిశీలించి కారకులపై తగిన చర్యలు తీసుకొంటామన్నారు.

ఊరటే..

(ఐదో పేజీ తరువాయి)

తగ్గించారు. అయితే ఇప్పటికే ఉన్న ముద్రిత ధరలతో వ్యాపారులు విక్రయించారు. కానీ మోటారు వాహనాలతో పాటు ఏసీలు వంటి వాటిపై మాత్రం జీఎస్టీ తగ్గించక తప్పలేదు. సోమవారం నుంచి జీఎస్టీ తగ్గింపు అమల్లోకి వచ్చినా కొన్ని ప్రధానమైన వస్తువల ధరలే తగ్గాయి. చాలా చోట్ల నిత్యావసర సరుకులైన సబ్బులు, టూత్‌పేస్టులు, కాఫీ, టీ పోడులు, డ్రైఫ్రూట్స్, పప్పుదినుసులు ఇంచుమించుగా పాత ధరలే కొనసాగాయి. అలాగే ఔషధ ధరలు 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించినప్పటికీ అనేక మెడికల్ దుకాణాల్లో పాత ధరలకే విక్రయించడం కనిపించింది. స్మార్ట్‌ఫోన్‌ల ధరలు యథాతథంగా ఉన్నాయని చెబుతున్నారు. తొలిరోజు కావడంతో దీనిపై ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేదు. ప్రధాన వస్తు రంగంలోనే జీఎస్టీ తగ్గింపు అనేది కనిపించింది.

క్షేత్రస్థాయిలో అవగాహన లేక..

జీఎస్టీపై పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ప్రచారం నడిచింది కానీ క్షేత్రస్థాయిలో అవగాహన ఇంకా రాలేదు. జీఎస్టీ అధికారుల పర్యవేక్షణ లేక నిత్యావసర సరుకులు, మెడికల్, ఔషధాల ధరలు యథాతథంగానే సాగాయి. ఏసీటీవోలు, సీటీవోలు తమ పరిధిలో అవగాహన కల్పించేందుకు సిద్ధపడుతున్నారు. ప్రాధాన్యతా క్రమంలో 16 రంగాల్లో గ్రాఫ్‌లను ముద్రించి కూడళ్లలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మెప్మా, సచివాలయ వ్యవస్థతో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు.

పెరిగిన అమ్మకాలు..

ప్రధాన వస్తు రంగాల్లో జీఎస్టీ తగ్గింపు ప్రభావం సోమవారం స్పష్టంగా కనిపించింది. వాహనాల షోరూంలు, గృహోపకరణాల షాపుల్లో జన తాకిడి పెరిగింది. మోటారు సైకిళ్లు, కార్లు, టీవీ షోరూంల్లో ప్రత్యేకంగా ధరల తగ్గింపు బోర్డులను ప్రదర్శించారు. 28 శాతం జీఎస్టీ ఉండే మోటారు సైకిళ్లు, కార్లు, టీవీలు 18 శాతానికి తగ్గడంతో వేల రూపాయాల్లో ధరల తేడా కనిపించింది. కొనుగోలు చేసిన వారితో పాటు ఎంత శాతం తగ్గిందని తెలుసునేందుకు వచ్చిన వారితో షోరూంలు, షాపులు కాస్తా రద్దీగానే కనిపించాయి. మరో వారం రోజుల్లో దసరా ఉండడంతో భారీగా క్రయ విక్రయాలు పెరుగుతాయని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

రూ.10 వేలు తగ్గింది

-టి.భాస్కరరావు, మెడికల్ రిప్రంజెంటేటివ్

కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీని ఈ నెల 22 నుంచి తగ్గించడంతో ఇప్పటి వరకూ వేచి చూసి ఈ రోజే వాహనాన్ని కొనుగోలు చేశాను. మోటారు సైకిళ్లపై 28 నుంచి 18 శాతానికి తగ్గడంతో రూ.10 వేలు ఆదా అయింది. జీఎస్‌టీ తగ్గింపు వల్ల సామాన్యుడికి ఎంతో లబ్ధిచేకూరుతుందనడంలో సందేహం లేదు.

భారీ వర్షాలకు అవకాశం

(ఐదో పేజీ తరువాయి)

కలెక్టర్ రామసుందర్ రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర (సాసా)పై సమీక్షించారు. సెప్టెంబరు వరకూ రాష్ట్ర స్థాయిలో ప్రతి నెల 9 నుంచి 11 మధ్య ర్యాంకులో జిల్లా ఉంటోందని, సాసా కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నప్పటికీ రిపోర్టింగ్ ఖచ్చితమైన వివరాలతో ఉండడం ముఖ్యమన్నారు. ఇంటింటా చెత్త సేకకణ, తడిపొడి చెత్తను వేరు చేయడం ముఖ్యమని, సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్లతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్లను వినియోగించడం తదితర కార్యక్రమాలపై ర్యాంకింగ్ ఇస్తారన్నారు. సమావేశంలో సీపీవో బాలాజీ, జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో మల్లిఖార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య తదితరులు ఉన్నారు.

గిరిజన వారపు సంతలో వైద్య శిబిరాలు

పార్వతీపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు వైద్య సదుపాయాలు అందించడానికి వారపు సంతల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలనిసబ్ కలెక్టర్ ఆర్.వైశాలి వైద్యాధి కారులను ఆదేశించారు. మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో 20 ప్రదేశాల్లో సంతలు జరుగుతున్నాయని, ఆయా సంతల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. దాంతో సోమవారం పాలకొండ మండలంలోని నవగాం, కురపాం మండలం నీలకంఠాపురం, సీతంపేటలో వైద్య శిబిరాలు నిర్వహించారు. మంగళవారం సాలూరులోని నేరేళ్లవలస, జీఎల్‌పురంలోని తాడికొండ, కురపాంలోని మొండెంకల్లు ప్రాంతాల్లో శిబి రాలు ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం పాచిపెంట మండలంలోని నాందేడువలస, సీతంపేటలోని మర్రిపాడు, జీఎల్ పురంలో... గురువారం పార్వతీపురం మార్కెట్‌యార్డు వద్ద, మక్కువ మండ లంలోని దుగ్గేరు, కురపాంలో ప్యాలెస్ రోడ్డు వద్ద శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. శుక్రవారం బలిజిపేటలోని సంతతోట, పాచిపెంట మండలంలో వేటగానివలసలో.. శనివారం మక్కువలోని నంద, జీఎల్‌పురం మండలంలోని గోరాడ, సీతానగరంలోని మార్కెట్ వద్ద, సీతంపేట మండలం లోని కుశిమి, సాలూరులోని తోనాం బస్టాండ్ వద్ద శిబిరాలు నిర్వహించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

బొబ్బిలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారి ఆలయాలు, పలు వీధుల్లో ఏర్పాటైన మండపాల్లో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గొల్లపల్లిలో దాడితల్లి అమ్మవారి ఆలయంలో అర్చకుడు పిండిప్రోలు మణికుమార్‌శర్మ, బంగారమ్మ ఆలయంలో అర్చకుడు ప్రకాశ్ పండా ఆధ్వర్యంలో అమ్మవారి మహోత్సవాలు మొదలయ్యాయి. తొలిరోజున అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారి దీక్షలను చేపట్టారు. స్థానిక బ్యాంకు కాలనీలో రాజరాజేశ్వరిదేవి భక్త కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు మొదలయ్యాయి. వేదపండితులు రంప అనంతశాస్త్రి, పిండిప్రోలు రామ్మూర్తి శర్మ, లక్ష్మణ శర్మ, తెలిదేవర సుబ్రహ్మణ్య శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. అలాగే తారకరామాకాలనీలో లలితాంబ అమ్మవారి ఆలయం, ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో సంతోషిమాత ఆలయం, దేశతల్లి ఆలయం, యాతవీధిలోని మజ్జిగౌరమ్మ ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

● బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దిబ్బగుడ్డివలస, జగన్నాథపురం గ్రామాల్లో సోమవారం దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.



బొబ్బిలి: గొల్లపల్లిలో దాడితల్లి అమ్మవారు



బొబ్బిలి రూరల్: జగన్నాథపురంలో..

తొలిరోజున బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ దంపతులు ఆధ్వర్యంలో వేద పండితులు పూజలు నిర్వహించారు.

పిరిడిలో భారీ వర్షం



పిరిడిలో నిలిచిన వరద నీరు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిరిడి గ్రామంలో సోమవారం సాయంత్రం ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. స్థానిక బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, కరాడ వీధి, పంచాయతీ కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ రోడ్డులో పెద్దఎత్తున వరదనీరు నిలిచింది. స్థానికులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

పట్టణంలో సమస్యలపై చర్చ

బొబ్బిలి సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వినయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీల సమస్య, భూకబ్జాలు తదితర విషయాలపై చర్చించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఎ.అప్పారావ, మండలాల అధ్యక్షులు, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారికి భలే 'ఉపాధి'

(ఐదో పేజీ తరువాయి)

6.85 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. 3.85 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఉపాధి హామీ పనుల్లో క్షేత్ర సహాయకులు కీలకం. గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడం, మస్తర్ల కేటాయింపు, కొత్త జాబ్‌కార్డుల మంజూరు, ఆధార్‌తో అనుసంధానం, కూలీలకు వసతుల కల్పన వీరి ప్రధాన విధి. కానీ చాలా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు సరిగ్గా పనిచేయడం లేదన్న విమర్శలున్నాయి. సీనియర్ మేట్లకు పనులు అప్పగించి సొంత పనులు చూసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. పైగా పనులు చేపట్టే వేతనదారుల బృందానికి సంబంధించి.. ఒక్కో మేట్ నేతృత్వంలో ఒక్కోలా వేతనాలు వస్తుండడంతో కొన్ని గ్రామాల్లో వివాదాలు నెలకొంటున్నాయి. కొన్ని గ్రామాల్లో సమయపాలన పాటించడం లేదని కూడా ఫిర్యాదులు ఉన్నాయి. ఉదయం గంట, సాయంత్ర గంట పనిచేయించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. అయితే ఉపాధిలో అవినీతి వల్లే క్షేత్రస్థాయిలో సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలుస్తోంది. ఏది జరిగినా అధికారులు కాపాడుతారులే అన్న ధీమా వారిలో ఉంది.

వైసీపీ హయాంలో భారీ అవినీతి..

వైసీపీ హయాంలో ఈ పథకం అవినీతిమయంగా మారింది. అక్రమాలకు అలవాటుపడిన యంత్రాంగం అదే బాటను కొనసాగిస్తోంది. వాస్తవానికి ఉపాధి హామీ పథకం పర్యవేక్షణ అధికార యంత్రాంగానిదే. ఇందులో నేరుగా రాజకీయ జోక్యం ఉండదు. కిందిస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి పైస్థాయిలో జిల్లా అధికారులే పర్యవేక్షకులుగా ఉంటారు. కానీ తిలా పాపం తలో పిడికెడు అన్నట్టు ఈ అవినీతిలో అందరి పాత్ర ఉంటోంది. కూలీల కష్టాన్ని దోచుకుంది కొందరైతే..దొంగ మస్తర్లతో సొమ్ము పక్కదారి పట్టించింది మరికొందరు...ఇలా వైసీపీ హయాంలో జిల్లాలో భారీగా అవినీతి జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక చెక్‌పడుతుందని అంతా భావించారు కానీ అప్పటి అధికారులు, సిబ్బంది ఉండడం.. అలవాటు పడిన పని కావడంతో కొంతమంది ఇప్పటికీ చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలున్నాయి. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో కోట్లాది రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టినట్టు సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వెల్లడించినా రికవరీ శూన్యం. దీనిపై కూటమి ప్రజాప్రతినిధులు సైతం దృష్టిపెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్, పంచాయతీరాజ్ కమిషనర్‌లకు ఫిర్యాదులు వెళ్లినా సీరియస్ యాక్షన్‌లోకి దిగడం లేదు.

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి



రోడ్డు గుంతను చూపిస్తున్న సాంబమూర్తి

కొమరాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా ఉన్న అంతర రాష్ట్ర రహదారి అధ్వానంగా ఉంది. సుమారు 36 ప్రదేశాల్లో భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతర రాష్ట్ర రహదారిపై గుంతలను తక్షణమే పూడ్చాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వైద్యుల డిమాండ్లను పరిష్కరించండి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యాధికారుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని భానుప్రతాప్, చాందిని, సత్యవేణి కోరారు. సోమ వారం ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ను ఐటీడీఏ కార్యాలయంలో కలిశారు. పీవోను కలిసిన వారిలో పీహెచ్‌సీల వైద్యులు ఉన్నారు.

62 మందికి ఉద్యోగావకాశాలు



జాబ్‌మేళా నిర్వహిస్తున్న దృశ్యం

బొబ్బిలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 62 మంది యువత ఉద్యోగావకాశాలను దక్కించుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు తెలిపారు. మ్యాన్‌కైండ్ ఫార్మా, ఆర్విక్స్ ల్యాబ్స్, వశిష్ఠ ఫార్మాచెమ్, ఓసిమమ్ ల్యాబ్స్, మంజు శ్రీటెక్నో ప్యాక్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేలో మొత్తం 130 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపికైన వారిని ప్రిన్సిపాల్ అభినందించారు.

నిందితురాలిని అరెస్టు చేయండి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బిగులు లక్ష్మిని కులం పేరుతో దూషించిన బంటుపల్లి దివ్యను అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు రాకోటి నాగమ్మ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శ్రీనుకు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విషయమై ఈ నెల 13న బొబ్బిలి పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారన్నారు. అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ ఇంతవరకూ అరెస్టు చేయకపోవడంలో అంతర్యం ఏంటని ఆమె ప్రశ్నించారు.

మహిళ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



కోమటిపల్లిలో పౌష్టికాహార ప్రదర్శన

రామభద్రపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో వరహాలమ్మ అన్నారు. ఆరికతోట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. నంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఎక్కువగా పౌష్టికా హారం తీసుకోవాలన్నారు. దీనివల్ల రక్తహీనత లోపం నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రత్నకుమారి, సూర్యకుమారి, కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీవో జె.విజయలక్ష్మి అన్నారు. కోమటిపల్లి, పెంట, ఎం.బూర్జవలసల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ్ అభియాన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ పిల్లలకు ఆపార్ ఐడీలు, అంగన్‌వాడీ సిబ్బందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు డౌన్‌లోడ్ చేశారు. గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలతో తయారైన తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువల ఆహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం స్టాల్స్ ఏర్పాటు చేశారు, ఊబకాయం నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెక్టర్ సూపర్‌వైజర్ ఎన్.ప్రభావతి, కె.సుబ్బలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీహెచ్‌సీలో రక్తదాన శిబిరం

బొబ్బిలి సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఉదయం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ గేదెల శశిభూషణరావే ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. రక్తదాతలు, సామాజిక కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఓటరు జాబితాల సవరణపై శిక్షణ

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాల సవరణలపై స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఎలక్షన్ డీటీ గౌరీశంకరరావు ఆధ్వర్యంలో 264 మంది బూత్ లెవల్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా 2002 సంవత్సరం నాటి ఓటర్ల జాబితాతో 2025 సంవత్సరం జాబితా సరిపోల్చి అవసరమైన చోట సవరణ చేయాలని సూచించారు. మృతి చెందిన ఓటర్ల తొలగింపు, జాబితాలో తప్పుల సవరణ, ఫొటో ఓటరు గుర్తింపు కార్డులతో సమస్యలను అధిగమించడం తదితర అన్ని అంశాలను పరిశీలించుకోవాలన్నారు. ఓటరు జాబితాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశం నిర్వహించి ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

లీజును రద్దు చేయండి

బొబ్బిలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐకి చెందిన స్థలంలో టూరిజం శాఖ నిర్మించిన భవనం, ఖాళీస్థలాన్ని థర్డ్ పార్టీకి నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టిన లీజు అగ్రిమెంట్‌ను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జేసీ సేతు మాధవన్‌కు వినతిపత్రం అందజేశానని శంకరరావు విలేకరులకు తెలిపారు. రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఉన్న అత్యంత విలువైన స్థలాన్ని బీజేపీ నాయకుడికి లీజుపేరుతో కట్టబెట్టడం అన్యాయమని తెలిపానన్నారు. దీనిపై జేసీఈ స్పందించారన్నారు. బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావుతో ఫోన్ లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారన్నారు. దీనిపై వెంటనే నివేదిక సమర్పించాలని ఆర్డీవోను ఆయన ఆదేశించినట్టు శంకరరావు తెలిపారు.

మహిళల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట

రామభద్రపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారి అపర్ణ తెలిపారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరికతోట పీహెచ్‌సీలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ తీసుకొని మెరుగైన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రేడియాలజీ వైద్యాధికారి జె.ప్రసాదరావు, ఆయుష్మాన్ వైద్యాధికారి సుబ్బారాయుడు, స్థానిక వైద్యాధికారి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

రామభద్రపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని హౌసింగ్ ఏఈ మత్స వెంకటేష్ సూచించారు. సోమవారం రొంపల్లిలో ఆయన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తి నిర్మాణాలుకు కూటమి ప్రభుత్వం అదనంగా రూ.50వేలు మంజూరు చేసిందన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయని లబ్ధిదారులకు నోటీసులు కూడా అందజేశామన్నారు. మండలంలో కొత్త ఇళ్లకు 1360 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో రొంపల్లి ఎంపీటీసీ సభ్యుడు భవిరెడ్డి శంకరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చైతన్య పాల్గొన్నారు.

అధ్వానంగా సీతారామసాగర్ కాలువ



పూడికతో నిండిన సీతారామసాగర్ కాలువ

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అలజంగిలోని రైతుల పొలాలకు సాగునీరు అందించే సీతారామసాగర్ కాలువ అధ్వానంగా ఉంది. కాలువ యావత్తూ పూడికతో నిండింది. దీంతో రైతులకు సాగునీరు అందడంలేదు. ఈ కాలువ పరిధిలో 500 ఆయకట్టు ఉంది. కాలువలో తుప్పలు తొలగించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యమని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉపాధి హామీ పనులు మొక్కుబడిగా చేయడమే ఇందుకు కారణమన్నారు. ఈ విషయంపై ఏపీవో లక్ష్మీపతిరాజును వివరణ కోరగా త్వరలో పూడికలు తొలగించే ఏర్పాటు చేస్తామని తెలిపారు.